# క్రీడాస్థలి

ఆ రోజు ఆట మొదలవుతుంది
తర్జన భర్జనల నేపథ్యంలో
మానవ హారాల ముళ్లకంచెల మధ్య
క్రీడల క్రీనీడలన్నీ
సరిహద్దు సైనికులై తలపడతాయి

పర్యవసానాలేవో వెంబడిస్తున్నట్టు
సాఫల్యవైఫల్యాల కత్తి వాదరల మీద
శ్రమ నైపుణ్యాల ఒక్కో అడుగూ పరిగెడుతుంది

ఆట సాగుతున్నంత సేపూ
అదేదో ఉన్మాద ప్రపంచం!
స్పందించే మానవ సముద్రం
కెరటాలు కెరటాలుగా కదులుతుంది

ఓర్వలేనితనం
ఉవ్వెత్తున లేస్తున్న మోనికాల్ని
వెన్నుపోటు పొడవటానికన్నట్టు
హొరెత్తి పోటెత్తుతుంది
మానసికోల్లాసం
మనుషుల మధ్య నజ్జు నజ్జు అవుతుంది

ఎక్కణ్ణుంచో ఏదో
విడ్డూరాన్ని చూస్తున్నట్టు
ఫేడౌట్లయిన పేలేలు బ్రాడ్‌మాన్లు

వైరాగ్యం నవ్వుల్ని చప్పరిస్తారు

రణరంగం లాంటి ఆట పూర్తయిన కాస్సేపటికే
కోలాహలమయిన ఆ ప్రాంతమంతా
మానవ కల్మషాన్ని నిండారా కప్పుకుని నిద్రపోతుంది
మరో రోజు ఆటకోసం
మళ్ళీ నిర్లిప్తంగా ఎదురుచూస్తూ –